క్లుప్తంగా

అగ్ని అస్త్రం కషాయం తయారీపై అవగాహన



ద్రావణం తయారీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు

బలిజిపేట: మండలంలోని బలిజిపేటలో వరి పంటలో పురుగుల నివారణకు స్థానిక సర్పంచ్ రాఘలత పొలం వద్ద అగ్ని అస్త్రం కషాయం తయారు చేయడంపై రైతులకు ఎంసీఆర్‌పీ లక్ష్మి గురువారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయానికి ఇది ఎంతో ఉపయోగ పడుతుందని ఆమె తెలిపారు. దీనివలన రైతులకు ఖర్చు తగ్గి దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశాలున్నాయన్నారు. కార్యక్రమంలో రైతు బి.సత్యనారాయణమూర్తి, ఐసీఆర్‌పీ తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహస్వామికి నవనీతం పూజలు



నవనీతం అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధిగాంచిన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన లక్ష్మీనృసింహస్వామి వారు నవనీతం అలంకరణలో గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు బృందం ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకూ స్వామికి నవనీతం పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

పెద్దగెడ్డ నుంచి 440 క్యూసెక్కుల నీరు విడుదల



పెద్దగెడ్డ నుంచి విడుదలవుతున్న నీరు

పాచిపెంట: మండల కేంద్రంలో పెద్దగెడ్డ జలాశయం నుంచి 440 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు జేఈలు రవికుమార్, వెంకట్ గురువారం తెలిపారు. ఇప్పటికే ఆదివారం నుంచి 220 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. రిజర్వాయర్‌లోకి వరద నీరు భారీగా చేరుతుండడంతో మరో 220 క్యూసెక్కులతో కలిపి మొత్తం 440 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు వారు పేర్కొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

వీరఘట్టం: మండల కేంద్రంలోని గ్రోమోర్ సెంటర్ వద్ద గురువారం వాహన తనిఖీలు చేస్తుండగా ఓ అనుమానితుడ్ని తనిఖీ చేయగా 162 సారా ప్యాకెట్లు పట్టుబడినట్లు ఎస్సై కళాధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఆయనతో పాటు హెచ్‌సీ రవిశేఖర ఉన్నారు.

గురువు బాధ్యత గొప్పది



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

- ఉపాధ్యాయుల కృషితోనే ఉత్తమ ఫలితాలు
- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: సమాజంలో గురువు బాధ్యత గొప్పదని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని లయన్స్ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగిన గురు పూజోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 73 మంది ఉత్తమ ఉపాధ్యాయులను అవార్డులతో సత్కరించారు. అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురువు చెప్పిన మాట తుచ తప్పకుండా పాటిస్తే విజయం తనంతట అదే వస్తుందన్నారు. ఉపాధ్యాయునిగా గురువులకు విశిష్ట గుర్తింపునిచ్చిన మహనీయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్ అని కొనియాడారు. తాను డైట్‌లో శిక్షణ పొంది గ్రూప్స్‌లో మంచి ర్యాంక్ సాధించి కలెక్టర్ స్థాయికి చేరుకోవడం, గురువుల మధ్య ఉపాధ్యాయ దినోత్సవంలో పాలుపంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలోనే ఉపాధ్యాయుల కృషితోనే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతున్నాయని చెప్పారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేసి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. సమాజాన్ని సన్మార్గంలో నడిపే గురుతరమైన బాధ్యత గురువుపైనే ఉందన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని కోరారు. అబ్దుల్‌కలాం వంటి వారి జీవితచరిత్రను, నూతన ఆలోచనలు, కాలం విలువ, ఆవిష్కరణకు అందించిన స్ఫూర్తిని విద్యార్థులకు అలవరచాలని సూచించారు. ఉపాధ్యాయులందరికీ గురు పూజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ సృష్టిలో తల్లిదండ్రులు బిడ్డలను ప్రపంచానికి పరిచయం చేస్తే గురువులు ఉన్నతంగా తీర్చిదిద్దుతారన్నారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధనా వృత్తిని ఎంతో పవిత్రంగా భావించి విద్యార్థుల్లోని స్వీయ ఆలోచనాశక్తిని పెంపొందించి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేస్తారన్నారు. అంతకు ముందు లైన్స్ క్లబ్‌లో ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, సైన్స్ ఫొటో ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ తిలకించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, డీఈఓ గార పగడాలమ్మ, సహాయ సంచాలకులు రమాజ్యోతి, సహాయ సంచాలకులు పి.సుధాకరరావు, జిల్లా సమన్వయ అధికారి ఎం.సుధాకర్, ఎంఈఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజ నిర్దేశకుడు ఉపాధ్యాయుడు

బలిజిపేట: గురు పూజోత్సవాన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమాజ నిర్దేశకుడు ఉపాధ్యాయుడు అని అన్నారు. గురువు గురుతర బాధ్యత కలిగి ఉండాలన్నారు. శ్రీరంగ రాజపురం ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని దాతలు ఆవిష్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. వంతరాం ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు బి.అప్పలస్వామినాయుడు ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆయన చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎస్.అప్పన్న, సంగంనాయుడు, ఎం.లక్ష్మయ్యలను సన్మానించారు. కార్యక్రమంలో నారన్నాయుడువలస ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో గురు పూజోత్సవాన్ని నిర్వహించారు.

మక్కువలో...

మక్కువ: మండలంలోని అన్ని పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కాశీపట్నం కేజీబీవీ పాఠశాలలో ప్రత్యేకాధికారిణి జి.నాగదుర్గ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ములక్కాయవలస మోడల్ పాఠశాలలో ఎస్ఏసీ ప్రిన్సిపాల్ ఎం.రత్నకుమారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



మక్కువ: కాశీపట్నం కేజీబీవీ పాఠశాలలో గురు పూజోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు



బలిజిపేట: శ్రీరంగరాజపురంలో సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించిన గ్రామస్తులు, ఉపాధ్యాయులు



మక్కువ: ములక్కాయవలస మోడల్ పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



బలిజిపేట: పెదపెంకిలో రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

విద్యాలయాల్లో టీచర్స్ డే సంబరాలు

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో గురువారం టీచర్స్ డే కార్యక్రమాలు వేడుకగా నిర్వహించారు. దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు.

ఉత్తమ గురువులు వీరే...



సాగు భూములకు పట్టాలివ్వాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజన రైతులు

పాచిపెంట: మండలంలో కుడుమూరు రెవెన్యూ 48 సర్వే నెంబరులో గిరిజనులు సాగు చేస్తున్న 782 ఎకరాల ప్రభుత్వ భూమికి సాగు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాతల కాలం నుంచి ఈ భూములు సాగు చేస్తున్న గిరిజనులకు పట్టాలు ఎందుకు మంజూరు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గుమ్మిడి సంధ్యారాణి తాము అధికారంలోకి వస్తే సాగు భూములకు హక్కులు కల్పిస్తామని, సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆమె మంత్రిగా ఉన్నారని, సాగు భూములకు రక్షణ కల్పించి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రవికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు, గిరిజన రైతులు, నాయకులు అప్పలస్వామి, కల్యాణ్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అవార్డుల ఎంపికలో సీనియర్లకు అన్యాయం

- యూటీఎఫ్ నాయకులు

వీరఘట్టం: ఈ ఏడాది జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికలో ప్రాథమిక, యూపీ పాఠశాలల సీనియర్ ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరిగిందని యూటీఎఫ్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం పలువురు నాయకులు మీడియాతో మాట్లాడుతూ, ప్రతి ఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం రోజున ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రకటిస్తుందన్నారు. ఇందుకోసం ప్రతి మండలం నుంచి ఎంఈఓలు సిఫార్సు చేసిన పేర్లను పరిగణనలోకి తీసుకుని, అందులోనుంచి జిల్లా కమిటీ ఎంపిక చేసిన వారికి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు ఇస్తుంటారని చెప్పారు. అయితే పార్వతీపురం మన్యం జిల్లాలోని పలు మండలాలకు చెందిన ఎంఈఓలు ఇచ్చిన ఉపాధ్యాయుల పేర్లు బట్టు దాఖలయ్యాయని ఆరోపించారు. పలుకుబడి ఉన్నవారు ఇచ్చిన పేర్లను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నట్లు విమర్శించారు. వీరఘట్టం మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయుల పేర్లను సిఫార్సు చేస్తే వారికి బదులు వేరే వాళ్ల పేర్లు జాబితాల్లో ఉన్నాయన్నారు. మండల స్థాయిలోనైనా సీనియర్ ఉపాధ్యాయులను మండల విద్యాశాఖాధికారులు సన్మానించక పోవడం సరికాదన్నారు. సమావేశంలో యూటీఎఫ్ నాయకులు మజ్జి పైడిరాజు, ఎస్.రాజకుమారి, కె.గోవిందరావు, బి.దుర్గాప్రసాద్, విశాలాక్షి, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు మరింత పౌష్టికాహారం

వీరఘట్టం: సంపూర్ణ పోషణతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మరింత పౌష్టికాహారం అందుతోందని సీడీపీఓ సిమ్మాలమ్మ అన్నారు. తలవరం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా గురువారం సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనతను అధిగమించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తోందన్నారు. ప్రతి నెలా కిలో కందిపప్పు, మూడు కిలోల బియ్యం, 250 గ్రాములు బెల్లం, 250 గ్రాముల చిక్కీలు, 500 గ్రాముల నూనె, 250 గ్రాముల ఎండు ఖర్జూరం, 25 కోడిగుడ్లు, 5 లీటర్ల పాలు, కిలో రాగిపిండి, తదితర సరుకులను సంపూర్ణ పోషణ కిట్ల ద్వారా అందజేస్తున్నామన్నారు. అనంతరం పలువురు గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జ్ఞానమ్మతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సాలూరు:

విజయనగరం జిల్లా మరడాంలోని 400 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న దృష్ట్యా సాలూరు నియోజకవర్గంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు ఆ శాఖ ఈఈ(ఆపరేషన్ డివిజన్) గోపాలరావునాయుడు గురువారం తెలిపారు. సాలూరు పట్టణంతో పాటు మండలం, పాచిపెంట, మక్కువ మండలాల్లో సబ్‌స్టేషన్ల పరిధిలో గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆయన నేత్రాలు సజీవం



మృతుడు కూర్మయ్య(ఫైల్)



కూర్మయ్య నేత్రాల నుంచి కార్నియాను సేకరిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడి గ్రామానికి చెందిన కల్లివిల్లి కూర్మయ్య(96) బుధవారం సాయంత్రం మృతి చెందారు. అయితే ఆయన తన నేత్రాల దానానికి సంబంధించి, 2016లోనే అంగీకారం తెలుపుతూ కుటుంబ సభ్యులను ఉద్దేశించి, లేఖ రాసి ఉంచారు. ఈ మేరకు తన తండ్రి కోరికను అర్థం చేసుకున్న కుమార్తెలు ఉమామహేశ్వరి, రమణమ్మ, ఈశ్వరమ్మ, పార్వతమ్మలు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ(శ్రీకాకుళం) వారికి సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడికి చేరుకున్న సిబ్బంది కూర్మయ్య కళ్లకు సంబంధించిన కార్నియాను సేకరించి, శ్రీకాకుళం తరలించారు. వాటితో పూర్తి అంధత్వంతో బాధపడుతున్న ఇద్దరు చిన్నారులకు చూపును ఇవ్వవచ్చని, ఆయన నేత్రాలు సజీవమని సిబ్బంది తెలిపి, దాత కుటుంబ సభ్యులను అభినందించారు.

ఎన్‌సీఎస్ కర్మాగారంలో యంత్ర పరికరాలు చోరీ



కర్మాగారం ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీం బృందం

సీతానగరం: మండలంలోని లక్ష్మీతిరుమల లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారానికి అనుసంధానంగా ఉన్న కోజెన్ పవర్ ప్లాంట్‌లో గత నెల 31న ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు, ఆయిల్ చోరీకి గురైనట్టు కర్మాగారం హెచ్‌ఆర్ సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసామని ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు. కర్మాగారానికి చెందిన ప్రాతంలో మే నెలలో పవర్ ప్లాంట్‌ను సందర్శించామని, తరువాత ఆగస్టు 31న సందర్శించిన సమయంలో చోరీ జరిగినట్టు గుర్తించామని సతీష్ ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. గురువారం హెచ్‌ఆర్ సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. జిల్లా కేంద్రం నుంచి క్లూస్ టీమ్ వచ్చి చోరీకి గురైన ప్రాంతాన్ని పరిశీలించిందని చెప్పారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలి..



ఎం.సింగుపురం పీహెచ్‌సీలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ విజయపార్వతి

పాలకొండ రూరల్: క్షేత్రస్థాయిలో ప్రజలు అనారోగ్య సమస్యల బారిన పడకుండా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ కె.విజయపార్వతి అన్నారు. మండలంలోని ఎం.సింగుపురం పీహెచ్‌సీని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై డాక్టర్ ఎస్. రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.